ప్రజాశక్తి

మంగళవారం 7 జనవరి 2025 | 5 | విజయనగరం



జిల్లా ఓటర్లు 15,66,438

మహిళలే అధికం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అనంతరం ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రకటించారు. దీని ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 15,66,438 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,72,393 కాగా, మహిళలు 7,93,974, థర్డ్ జెండర్ 71 మంది ఉన్నారు. గతేడాది అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితాలో 15,64,530 మంది ఉండగా, తుది జాబితా నాటికి సుమారు 2 వేల మంది ఓటర్లు పెరిగారు. అత్యధికంగా విజయనగరం నియోజకవర్గంలో 2,58,310 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా చీపురుపల్లి నియోజకవర్గంలో 2,05,761 మంది ఉన్నారు. ఎప్పటిలాగే జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉండటం విశేషం.

బాలలకు భద్రత కరువు

- ఏడాదిలో రెండు నోటిఫికేషన్లు వేసినా చేపట్టని నియామకాలు
- చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో దుస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని బాలసదన్‌లలో భద్రత, ఆలనా పాలన కొరవడింది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయకపోవడమే కారణం. ఏడాదిలో రెండు నోటిఫికేషన్లు జారీచేసినప్పటికీ భర్తీకి చర్యలు తీసుకోలేదు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆడపిల్లలు, ఆర్థిక భారంతో పెంపకానికి నోచుకోనివారి కోసం ప్రభుత్వం బాలసదన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వీరి రక్షణ, సంరక్షణ కోసం మన జిల్లాలో బొబ్బిలి, విజయనగరం, గజపతినగరంలో ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి ద్వారా 6 నుంచి 14 ఏళ్లలోపు వయసు గల ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే డిపిసి యూనిట్, దీని పర్యవేక్షణలో నడిచే ఈ కేంద్రాల్లో ఏడాది క్రితం నుంచే పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పైన పేర్కొన్న మూడు వసతి గృహాలతోపాటు వీటిని పర్యవేక్షించే చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం పద్ధతిలో 22 పోస్టులు భర్తీకి గత వైసిపి ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సహా, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, సోషల్ వర్కర్/ ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేటర్, కుక్, హెల్పర్/నైట్ వాచ్‌మెన్, హౌస్‌కీపర్, ఎడ్యుకేటర్, ఆర్ట్స్ - క్రాఫ్ట్ - మ్యూజిక్ టీచర్, పిటి - యోగా టీచర్, స్టోర్ కీపర్ తదితర పోస్టులు ఉన్నాయి. అప్పట్లో దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, మెరిట్ ఆధారంగా జాబితా తదితర కసరత్తు జరిగింది. ఆ తరువాత అప్పటి అధికారులు జాప్యం చేయడంతో ఈలోపు ఎన్నికల నోఫికేషన్ వచ్చింది. దీన్ని బూచీగా చూపి భర్తీకి చర్యలు తీసుకోలేదు.

తిరిగి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటి నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఇందులో 10 పోస్టులకు గతేడాది సెప్టెంబర్ 4న నోటిఫికేషన్ జారీచేసింది. సుమారు నాలుగు నెలలు గడిచినప్పటికీ భర్తీకి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీంతో ఈ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. పోస్టుల భర్తీ విషయంలో జాప్యం చేయడం పట్ల అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. ఆర్థిక, రాజకీయ పలుకుబడితో తమకు అన్యాయం జరిగే అవకాశం ఉందంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవానికి జిల్లాలో నిరుద్యోగం తాండవిస్తోంది. చదువుకున్న యువతకు ఉద్యోగాలు రాకపోవడంతో వలస కూలీల గాను, ఉపాధి కూలీల గాను మారుతున్నారు. ఇళ్లల్లో పనుల కోసం కూడా విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు వలసపోతున్న మహిళలెందరో!. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో భర్తీచేయాల్సిన పోస్టుల భర్తీకి కూడా మీనమేషాలు లెక్కించడం గమనార్హం. ఈ విషయం జిల్లా మంత్రి దృష్టిలో ఉందా? లేదా? అన్న చర్చ సాగుతోంది. ఇప్పటికైనా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. మరోవైపు ఇన్ని పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల తెలిసీ తెలియని, పెరిగే దశలో ఉన్న ఆడపిల్లలకు తగిన తిండి, ఆలనా పాలన, రక్షణ కొరవడుతుందని కూడా పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇఎస్ఐ ఆస్పత్రిలో ఖాళీలు భర్తీ చేయాలి

మందులు, వైద్య పరికరాల కొరత తీర్చాలి ● సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ఇఎస్ఐ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇఎస్ఐ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని, మందులు అందుబాటులో ఉంచాలని సోమవారం నగరంలోని ఇఎస్ఐ ఆస్పత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ విజయనగరం ఇఎస్ఐ డిస్పెన్సరీ, ఆస్పత్రి పరిధిలో సుమారు 10 వేల మంది కార్డు హోల్డర్లు ఉన్నారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో కలిపితే 60 వేల మంది లబ్ధిదారులకు వైద్యం అందించాల్సి ఉందని చెప్పారు., అందుకు తగిన వైద్యులు, సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు లేకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయన్నారు. వారి కష్టార్జితంలో కొంత భాగాన్ని ఇఎస్ఐకి చెల్లిస్తున్నా వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మూడేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభించిన ఇఎస్ఐ ఆస్పత్రి ఇంకా నిర్మాణ దశలోనే ఉందన్నారు. ప్రయివేట్ ఆస్పత్రిలో సైతం కోట్ల రూపాయలు బకాయిలు ఉండటంతో వైద్యం చేయడం లేదన్నారు. ఇఎస్ఐ యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, వైద్యులు, సిబ్బందిని నియమించి, మందుల కొరతను తీర్చాలని డిమాండ్‌చేశారు. ఇద్దరు వైద్యుల డెప్యుటేషన్‌ను రద్దు చేయాలని, ఆస్పత్రిలో ఇఎస్ఐ స్థానిక కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రి నిర్మాణం వేగవంతం చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, యుఎస్ రవికుమార్, బి.సుధారాణి, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర జట్లకు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు జిల్లా క్రీడాకారులు ఎం.రాంబాబు, సిహెచ్.మురళీ, పి.నందిని, వి.సూర్యకళ, ఎం.పావని రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుండి 12 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే 50వ జాతీయ జూనియర్ బాల, బాలికల కబడ్డీ ఛాంపియన్ షిప్‌లో వీరు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్షులు రంగారావు దొర, కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజర్ , శివ హర్షం వ్యక్తంచేశారు.

ధర్నా చేస్తున్న వ్యకాస నాయకులు, పెదమానాపురం గ్రామస్తులు

రైల్వే మూడో లైన్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో రైల్వే మూడో లైన్‌లో ఇళ్లు కోల్పోయిన బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి శ్రీనివాస్ మాట్లాడుతూ 2022 సంవత్సరంలో పెదమానాపురంలో మూడో రైల్వే లైన్ కోసం 43 కుటుంబాలు తమ ఇళ్లను త్యాగం చేశాయని గుర్తుచేశారు. ఇళ్లు తీసుకునేందుకు అధికారులు బెదిరించడం, మార్కెట్ రేటుకు మించి పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు కానీ తీరా చూస్తే అత్యల్ప నష్టపరిహారం చెల్లించారని చెప్పారు. సర్వేనెంబర్ 132-1లోని ఈ కుటుంబాలు తాతల కాలం నుంచి ఉంటున్నాయని తెలిపారు. నష్ట పరిహారం చెల్లింపు, పునరావాస కల్పనపై అధికారులు శ్రద్ధ చూపలేదని, ప్రభుత్వాలు పట్టించుకోలేదని, దీంతో బాధితులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తోటపల్లి, పెద్దగడ్డ నిర్వాసితులకు ఇచ్చిన విధంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని చెప్పారు. పాత ఇళ్లకు ఇచ్చిన పరిహారం డబ్బులతో స్థలమే రాదని, స్థలాలు కొనుక్కొని ఇళ్లు కట్టుకోవడం అంటే ఎలా సాధ్యమవుతుంది ప్రశ్నించారు. కోల్పోయిన ఇళ్లకు మళ్లీ సర్వే చేసి, కొలతలు సరిచేసి, నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఆదుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్తు పోరాటాలకు అధికారులదే బాధ్యతని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. పరిశీలించి, న్యాయం చేస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో గాడి అప్పలనాయుడు, గేదెల రామసత్యం, సిహెచ్ గోవింద, బోర లక్ష్మి, బోర రాంబాబు, మెండి సతీష్, మెండి ఆదిలక్ష్మి, బి.పోలి తదితరులు పాల్గొన్నారు.

పాల ధరను పెంచకుంటే

విశాఖ డెయిరీని ముట్టడిస్తాం

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తగ్గించిన పాల ధరను పెంచకపోతే విశాఖ డెయిరీని ముట్టడిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రోజుకు 9 లక్షల లీటర్ల పాలు సేకరించడం ద్వారా రూ.1.20 కోట్ల చొప్పున నెలకు రూ.40 కోట్లకు పైగా లాభం పొందుతున్న విశాఖ డెయిరీ యాజమాన్యం... పాలధరను తగ్గించి రైతులకు అన్యాయం చేయడం దారుణమన్నారు. ఇప్పటికే ఎపి రైతు సంఘం ఫిర్యాదు మేరకు ప్రభుత్వం ఆరుగురు ఎమ్మెల్యేలతో విచారణ కమిటీ వేసిందన్నారు. ఆ కమిటీ విచారణకు విశాఖ డెయిరీ చైర్మన్ హాజరు కాకపోవడం, ఎమ్‌డి పొంతన లేని సమాధానం చెప్పడం ద్వారా చైర్మన్ అవినీతి ప్రాథమికంగా రుజువైందని స్పష్టంచేశారు. రైతుల పొట్ట కొట్టి ఆస్తులు కూడగట్టుకొంటున్న చైర్మన్ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు బిజెపిలో చేరారని తెలిపారు. రైతులకు అన్యాయం చేసి, అవినీతికి పాల్పడిన వారిని బిజెపిలో ఎలా చేర్చుకుంటారని, ఆయనను కూటమి పాలకులు ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలు లాభం పొందుతున్న చైర్మన్... రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వెంటనే పాల ధరను పెంచి, విచారణ పూర్తి చేయాలని, లేకుంటే విశాఖ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పాల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి జి.గుంపస్వామి, నాయకులు టి.పైడిపునాయుడు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

గ్రీవెన్స్‌కు 163 వినతులు

రీఓపెన్ అర్జీల పట్ల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 163 వినతులు అందాయి. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, మురళి తదితరులు వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 163 వినతులు అందగా, అందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 123 అర్జీలు వచ్చాయి. డిఆర్‌డిఎకు 18, మున్సిపల్ శాఖకు 5, డిపిఒకు 5 చొప్పున వినతులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో వినతుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. సంతృప్తికర రీతిలో పరిష్కరించక మళ్లీ రీఓపెన్ చేసిన వినతులపై సమీక్ష నిర్వహించారు. రీ ఓపెన్ కేసులు లేకుండా చూడాలని పదే పదే చెప్తున్నా ఎందుకు మళ్లీ వస్తున్నాయని సంబంధిత శాఖల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చూడకుండా ఉన్న వినతులు కూడా ఉన్నాయని, అధికారులు వెంటనే చూడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిఎంఒకు పంపే మినిట్స్‌లో వారి పేర్లను నమోదు చేస్తామని తెలిపారు. ఆర్థికేతర వినతులన్నింటికీ తగు పరిష్కారం చూపాలని, ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు.

ప్రయివేటు స్కూళ్ల సమస్యలపై గళం వినిపిస్తా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకర శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రయివేటు స్కూళ్ల సమస్యపై చట్టసభల్లో గళం వినిపిస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకర శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, ప్రయివేట్ పాఠశాల వ్యవస్థాపకుడిగా తన 35 ఏళ్ల అనుభవంలో అనేక సమస్యలను చవిచూశానన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో తొలిసారిగా ప్రయివేట్ స్కూళ్ల అసోసియేషన్ (అపుస్మా) తరపున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.వి.రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, జోనల్ అధ్యక్షులు ఎం.వి.రావు, పలు ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేసి, లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు.. ఆ పార్టీ నాయకులను కోరారు. సోమవారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్రాంతిలోపు అన్ని డివిజన్లు, గ్రామాల నాయకులు లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 8న విశాఖపట్నంలో జరిగే ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ, మండల అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, బోడసింగి శంకర్రావు, మాజీ ఎంపిపి కె.సాయి జగ్గారావు, సర్పంచ్ బి.ఈశ్వరరావు, కె.రాంబాబు, పి.గౌరునాయుడు, జి.సత్యనారాయణ, టి.రామారావు, పి.రామకృష్ణ, తెలుగు మహిళా పార్లమెంట్ కార్యదర్శి అనురాధ బేగం పాల్గొన్నారు.

మార్పు బాలకృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ ఉద్యమ నేత, కీర్తిశేషులు మార్పు బాలకృష్ణ 12వ వర్ధంతిని నగరంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ తుదిశ్వాస విడిచే వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పట్ల బాలకృష్ణ పోరాట పంథానే కొనసాగించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌బి పైడిరాజు, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఆర్.కృష్ణ, జిల్లా నాయకులు శ్రీదేవి, సిహెచ్‌బిఎస్-ఎల్ మూర్తి, వి.అప్పలరాజు, పి దామోదర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శారీరక దారుఢ్య పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ 8న పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహించాల్సిన పిఎంటి, పిఇటి పరీక్షలను 11వ తేదీకి రాష్ట్ర పోలీసు నియామక మండలి వాయిదా వేసినట్లుగా ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వైకుంఠ ఏకాదశి, శాంతిభద్రతల పరిరక్షణ విధులను పోలీసు శాఖ నిర్వహించాల్సి ఉన్నందున వాయిదా వేసినట్లు చెప్పారు. 8న పిఎంటి, పిఇటి పరీక్షలకు హాజరుకావాల్సిన అభ్యర్థులు.. 11న ఉదయం 5 గంటలకు యథావిధిగా పరేడ్ గ్రౌండ్‌కు హాజరుకావాలని కోరారు.

నేడు టెన్నికాయిట్ జట్లు ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కొప్పెర్ల గురుకులంలో మంగళవారం టెన్నికాయిట్ బాల, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2006 ఏప్రిల్ ఒకటో తేది తరువాత జన్మించిన వారు అర్హులని, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జట్లు ఈ నెల 11, 12వ తేదీల్లో పలాసలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. వివరాలకు 9491761126 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దేశ సమైక్యతను కాపాడుకుందాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

ప్రచారం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మతోన్మాదుల దాడులను తిప్పికొట్టి, దేశ సమైక్యతను కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ప్రజలను కోరారు. సోమవారం నగరంలోని కోట జంక్షన్ నుంచి గురజాడ నివాసం వరకు సిపిఎం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మతాలన్నీ మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును.. అన్న గురజాడ సూక్తి ఎప్పటికీ అనుసరణీయమన్నారు. మత సామరస్యానికి గండికొట్టి, మతోన్మాద చర్యలకు పూనుకుంటున్న ఉన్మాద శక్తుల నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రజలే కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర నాయకులు బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీలు

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం రూరల్ మండలంలోని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ జీవనరాణి సోమవారం.. ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాత, శిశుఆరోగ్య సేవలను, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు, పిల్లల టీకాలు, మందుల నిల్వలు, ఒపి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 గంటలూ పిహెచ్‌సిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాకోడు పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

విజయనగరం సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి రాజేష్ కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు డి.సీతారాం, సాయి పవిత్ర పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ పరుగు పోటీల్లో

జిల్లా అథ్లెట్లకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరిగిన రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పరుగు పోటీల్లో విజయనగరం జిల్లా అథ్లెట్లు నాలుగు పతకాలు సాధించారు. 8 కిలోమీటర్ల విభాగంలో ఎం.హరీష్ బంగారు పతకం సాధించాడు. 10 కిలోమీటర్ల విభాగంలో యోగేష్‌కుమార్ రజతం, ఆరు కిలోమీటర్ల విభాగంలో బి.సాయి రజతం, పి.సురేష్ కాంస్య పతకం సాధించారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణపై

ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్న క్యాంటీన్ల నిర్వహణ, విధివిధానాలపై ప్రజాభిప్రాయాలు సేకరించేందుకు క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అన్న క్యాంటీన్లకు వెళ్లే ప్రజలు... ఆహార పదార్థాలు, పారిశుధ్యం, ఇతర అంశాలపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించాలని కోరారు.

డ్రెయిన్ల పరిశీలన

ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ డ్రెయినేజీ విధానం పరిశీలించాలని కమిషనర్ నల్లనయ్య.. ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం డిఇ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని, పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ప్రణాళికను రూపొందించి కమిషనర్‌కు అందజేయనున్నట్లు వారు తెలిపారు. బుచ్చన్న కోనేరు వద్ద కాలువ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించడంతో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలువ నిర్మాణానికి రూ.3.30 లక్షలు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుకు అందిన దరఖాస్తుల మేరకు తయారు చేసిన ఓటర్ల తుది జాబితాను సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నోటీస్ బోర్డ్‌లో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాధ రావు ప్రదర్శనగా ఉంచారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. వేణు గోపాలరావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, వి.ఆర్.ఒ రవి, ఆపరేటర్ మహేష్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు చేయి చేయి కలిపి తల్లి తండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో క్షయ వ్యాధి గ్రస్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం విరాళాలు సేకరించి లెప్రసి అంగవైకల్యం నివారణకు రూ.17068లను లెప్రా సొసైటీ సంస్థకు హెచ్‌ఎం చేతులు మీదగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ ఎం వి.జ్ఞాన శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాలను ఇప్పటి నుంచే అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లెప్రా సొసైటీ ఫండ్రైసింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణ, పిఇటి పతివాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభలతో అభివృద్ధి

ప్రజాశక్తి - వేపాడ

మాట్లాడుతున్న గొంప వెంకటరావు, తులసి

గ్రామ సభలతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బానాది ఎంపిటిసి గొంప తులసి అన్నారు. మండలంలోని బానాదిలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సభలు ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులను గుర్తించి అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది శాఖపరంగా గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మూర్తి, సచివాలయ సిబ్బంది, హెల్త్ డిపార్ట్మెంట్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి కోసం చెరువుగట్టు తవ్వివేత

ప్రజాశక్తి - భోగాపురం

రహదారి కోసం ఏకంగా చెరువు గట్టును తవ్వేయడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకొని యధావిదిగా చెరువు గట్టును కప్పారు. మండలంలోని ముంజేరు రెవెన్యూ పరిధిలోని రాళ్ల చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రహదారి కోసం ఇటీవలి తవ్వేశారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. తహశీల్దార్ ఎం సురేష్ ఆదేశాల మేరకు విఆర్ఓ శ్రీనివాసరావు చెరువుగట్టును సోమవారం పరిశీలించి చెరువుగట్టు తవ్వేసినట్లు గుర్తించి వెంటనే జెసిబిని తెప్పించి చెరువు గట్టును యధావిధిగా పూడ్చివేశారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ చెరువు గట్టును రహదారి కోసం తవ్వేసినట్లు సమాచారం వచ్చిందని వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎవరు తవ్వేరనేదానిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని విఆర్వోను ఆదేశించినట్లు తెలిపారు.

వైభవంగా పూలంగి సేవ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం పూలంగి సేవ అంగరంగ వైభవంగా జరిగింది. కడియం, బెంగుళూరు, పూణే, ఊటి నుంచి తీసుకు వచ్చిన 50 రకాల బంతి, చామంతి పువ్వులతో రుక్మిణి సత్యభామ సమేతంగా శ్రీవేణుగోపాలుడుని, ఆలయాన్ని అలంకరించి పూజలు చేశారు. పూలంగి సేవను ఆలయ ధర్మకర్తలు సుజయకృష్ణ రంగారావు, బేబినాయన ప్రారంభించగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి, కురుపాం ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, తోయక జగదీశ్వరి పూలంగి సేవకు వచ్చి పూజలు చేశారు. పూలంగి సేవకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి సుమారు 20వేల మంది యాత్రికులు హాజరై పూజలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కృష్ణారాయిపేట ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంటగది, కిచెన్ గార్డెన్, టాయిలెట్స్, తరగతి గదులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.గణేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట నిర్వహించే వారిపై ఇప్పటికే నిఘా పెట్టామన్నారు. గతంలో పేకాట, కోడి పందేల్లో అరెస్టయిన వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేస్తున్నామన్నారు. కోడి పందేలు, పేకాట నిర్వహించడం, బెట్టింగులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టిబి వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కే అప్పారావు, వేపాడ పిహెచ్‌సి సిబ్బంది సిహెచ్ఒ జి ఎస్ఆర్ ఆంజనేయులు, సూపర్వైజర్ వి.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ డి సత్యనారాయణ, జూనియర్ కాలేజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్య భరోసా పింఛన్లు పరిశీలన

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని జగన్నాధపురం, కమ్మవలస, కోమటిపల్లి, పిరిడి గ్రామాల్లో సోమవారం ఎన్‌టిఆర్ వైద్య భరోసా పెన్షన్లు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పిరిడి పిహెచ్‌సి వైద్యాధికారి రఘు వంశీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం మంచానికే పరిమితమై పెన్షన్ అందికొంటున్న వారి ఇళ్లకు వెళ్లి విజయనగరం నుంచి వచ్చిన పరిశీలనా బృందం పరిశీలన కార్యక్రమం చేస్తోందన్నారు. వారిలో ఆర్థో పెడిషియన్ వైద్యులు బి.రామారావు, పి.శైలజ ఉన్నారని తెలిపారు. నివేదికలను ఉన్నత అధికారులకు అందజేస్తారని వివరించారు.

చదువుపై నిర్లక్ష్యం వద్దు : తూముల

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

విద్యార్థుల చదువుపై నిర్లక్ష్యం విడనాడాలని భాస్కర ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ తూముల భాస్కరరావు అన్నారు. సోమవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఫస్ట్ ఇయర్ బి.ఫార్మసీ ఒరైంటేషన్ ప్రోగ్రామ్ కోమటిపల్లి కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫార్మసీ విద్య వల్ల ఉపయోగాలు ఉన్నాయని, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మందులు వాడటం వల్ల కలిగే ఉపయోగాలు, దుష్ప్రబావాలు ఆరగ్యకరమైన ఆహార అలవాట్లు, వ్యాయామం గురించి కళాశాల ప్రిన్సిపాల్ డా.కొణతాల రాజేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర కొణతాల రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబిఎం పాఠశాలను స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సిబిఎం పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పిసిసి సభ్యులు ముచ్చల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిబిఎం పాఠశాలను కొనుగోలు చేసిన వారు, అమ్మిన వారిపైన క్రిమినల్ కేసులు పెట్టాలని సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబిఎం పాఠశాలను చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. 110 ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాలను అమ్మి వేయడం అన్యాయమన్నారు. పాఠశాల అమ్మకంతో పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాల సృష్టికర్త ఎవరో తేల్చాలని ఆర్‌డిఒ కార్యాలయంలో డిటి నాగేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ బొబ్బిలి నాయకులు కింతల రాము పాల్గొన్నారు.

ఆస్పత్రి నిధులు బొక్కేశారు..

● అనుమతుల్లేకుండా విత్‌డ్రా చేసిన సిబ్బంది ● రెండేళ్లుగా ఇదే తంతు ● ఆస్పత్రిలోనూ అందుబాటులో ఉండని యంత్రాంగం

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను కొంత మంది ఆస్పత్రి సిబ్బంది, ఉద్యోగులు కలిసి బొక్కేస్తున్నారు. కనీసం అభివృద్ధి చేయకుండా ఇష్టానుసారంగా నిధులను డ్రా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులకు ఒక్క మాట కూడా చెప్పకుండా దోచేస్తున్నారు. ఆస్పత్రి పరిధిలో ఉన్న పంచాయతీలకు ఇవ్వాల్సిన పారిశుద్ధ్యం నిధులను సైతం పంచాయతీ సర్పంచులకు తెలియకుండా వారి అనుమతులు లేకుండా డ్రా చేసి స్వాహా చేస్తున్న పరిస్థితి మోపాడ పిహెచ్‌సి కేంద్రంగా జరుగుతోంది. దీనిపై అధికారులు దృష్టి పెట్టి నిధుల స్వాహాపై విచారణ చేపట్టి ప్రభుత్వం వెచ్చించిన నిధులతో ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ పిహెచ్‌సిలో సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండకపోవడమే కాకుండా నిధులను కూడా స్వాహా చేసేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఆస్పత్రిలో ఎటువంటి అభివృద్ధి చేయాలన్నా ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి అనుమతులు తీసుకుని నిధులు డ్రా చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ సలహా మండలి సమావేశం లేకుండా ఆస్పత్రి సిబ్బంది ఇష్టానుసారంగా నిధులను డ్రా చేసి ఎటువంటి అభివృద్ధీ చేయకుండా డబ్బులు మింగేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై గ్రామస్తులు ఇప్పటికే సహచట్టం ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిస్తోంది. గత ప్రభుత్వంలో ఎటువంటి పనులూ చేయకుండా రూ.1.75లక్షలు విత్‌డ్రా చేసేసిన సిబ్బంది ఈ ఏడాది ఎంపిపి సంతకంతో మరో రూ.65 వేలు విత్‌డ్రా చేసి కాజేశారు. ఈ విషయం ఆస్పత్రి సలహా మండలి సభ్యులకు తెలియలేదంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. వాస్తవానికి ఎటువంటి చిన్న బిల్లు పెట్టాలన్నా ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సంతకాలతో అనుమతి తీసుకుని నిధులు విత్‌డ్రా చేయాలి. కానీ ఇక్కడ ఒక్క ఎంపిపి సంతకం తీసుకుని మిగిలిన వారికి ఎటువంటి సమాచారమూ లేకుండానే నిధులు డ్రా చేసి వాడేసుకున్నట్లు సమాచారం. ఇవి కాకుండా మోపాడ సచివాలయం పరిధిలో ఉన్న మూడు పంచాయతీలకు ఆస్పత్రి నుంచి ఏడాదికి పారిశుధ్యం నిమిత్తం ఒక్కో పంచాయతీకి రూ.5వేలు చొప్పున మొత్తం 15వేలు ఇవ్వాల్సి ఉంది. అవి కూడా పంచాయతీ సర్పంచులకు తెలియకుండా పంచాయతీలకు ఇవ్వకుండా సిబ్బందే విత్‌డ్రా చేసేసినట్లు తెలిస్తోంది. ఆస్పత్రిలో జరుగుతున్న ఈ అవినీతిపై మోపాడ సర్పంచ్ భర్త బడ్డుకొండ రమేష్‌నాయుడు, కొండరాజుపేట సర్పంచ్ భర్త బంగారురెడ్డి కలెక్టర్, డిఎంఅండ్‌హెచ్ఒకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అయితే సోమవారం ఆస్పత్రికి వచ్చిన డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ ఈ నిధులుపై ఎటువంటి వివరాలూ సేకరించకుండా కేవలం సిబ్బంది, వైద్యుల సమయపాలనపైన మాత్రమే తూతూ మంత్రంగా సమాచారం అడిగి వెళ్లిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

పిహెచ్‌సి పరిధిలో పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు స్వాహా

మోపాడ పిహెచ్‌సి పరిధిలో ఉన్న మోపాడ, కొండరాజుపేట, మోదవలస, జొన్నాడ, ఆకులపేట, బొడ్డవలస, రఘుమండ, డి.తాళ్లవలస, వెదుళ్లవలస పంచాయతీలకు కూడా ఏటా పారిశుధ్యం నిర్వహణకు ఇవ్వాల్సిన రూ.5వేలు ఇవ్వడం లేదని సర్పంచులు చెబుతున్నారు. ఈ నిధులను కూడా సర్పంచులకు తెలియకుండానే ఆస్పత్రి సిబ్బంది విత్‌డ్రా చేసి స్వాహా చేసినట్లు ఆరోపిస్తున్నారు.

సమాచారం ఉంది

ఆస్పత్రి అభివృద్ధి కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి కమిటీ సభ్యులకు చెప్పే విత్‌డ్రా చేశాం. ఇందులో సిబ్బంది చేతివాటం ఏమీ లేదు. ఇవన్నీ కేవలం ఆరోపణలు మాత్రమే.

వైద్యాధికారి పివివి యోగిత బాల, మోపాడ

మోపాడ పిహెచ్‌సిలో తనిఖీలు

మండలంలోని మోపాడ పిహెచ్‌సిలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ సూర్యనారాయణ సోమవారం తనిఖీలు చేశారు. ఇటీవల ప్రజాశక్తి పత్రికలో 'మోపాడ పిహెచ్‌సిలో అందని వైద్యం' అనే శీర్షికన కథనం వెలువడటంతో స్పందించిన కలెక్టర్ ఆస్పత్రిలో తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సూర్యనారాయణ ఆస్పత్రికి వచ్చి రికార్డులను పరిశీలించారు. అక్కడున్న సిబ్బంది, రోగులతో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది పనితీరు ఎలా ఉందని రోగులను అడిగి తెలుసుకున్నారు. అయితే రాత్రి పూట కూడా గ్రామంలోకి వచ్చి వైద్యం చేయమని గ్రామస్తులు ఒత్తిడి చేస్తున్నారని, దానికి అంగీకరించకపోవడంతో తమపై ఆరోపణలు చేస్తున్నారని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రోగులు, సిబ్బందితో మాట్లాడిన ఆయన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు.

'అవంతి'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ నెక్సవో ఏఐ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలకు బి.టెక్ అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎంపికలకు మన కాలేజీ విద్యార్థులతో పాటు అవంతి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులతో కలిపి మొత్తం 251మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ సాఫ్ట్ వేర్ కంపెనీ ఏఐ అనుబంధ డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు విభిన్న అప్లికేషన్స్ సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను తయారుచేస్తుందన్నారు. ఏఐ సహకారంతో స్టూడెంట్, టీచర్ అసెస్మెంట్‌కు సంబంధించి సాఫ్ట్ వేర్‌ని కూడా తయారు చేస్తుందన్నారు. ఈ ప్రాంగణ ఎంపికలు నెక్సవో.ఏఐ హెచ్.ఆర్ టీమ్ ఎమ్.రణదీవ్, ఆపరేషన్స్ మేనేజర్, వి.మౌనిక, ఏఐ డెవలపర్ కె.సునీల్, టెక్నికల్ మేనేజర్ పి.హర్షిత, హెచ్ఆర్ ఆపరేషన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బృంద చర్చలు, టెక్నికల్ పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి 21 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి వార్షిక వేతనం 3 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంగణం ఎంపికలు వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్ కుమార్, కాలేజ్ ప్లేస్మెంట్ అధికారి అభిలాష్ పర్యవేక్షణలో జరిగాయని తెలిపారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్యస్పందన లభించిందని కళాశాల జేకేసి కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరామన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న మాట్లాడుతూ విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 47కు పైగా నిరుద్యోగులు హాజరయ్యారని వారిలో హెట్రో డ్రగ్స్ కంపెనీలో 7 మంది, సేఫ్ డ్రైవ్ ప్లస్ 10 మంది, విశ్వముద్ర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 4గురు, ఇలా మొత్తం మూడు కంపెనీలకు 21 మంది ఎంపికయ్యారన్నారు. డిస్ట్రిక్ ప్లేస్మెంట్ ఆఫీసర్ భాస్కర రావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని జాబ్ మేళాలను ప్రతీ నెల నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వీటిని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెలెక్ట్ అయిన అభ్యర్థులకు ప్రిన్సిపాల్ చేతులు మీదిగా ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కే వాసుదేవరావు, అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్ శ్రీలక్ష్మి, డి లక్ష్మణ్, కె అప్పలరాజు, డీ హైమవతి, డీ రామకృష్ణ, పీడీ శివకుమార్, కె.భాస్కరరావు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీ ద్వారా కార్మికులకు మెరుగైన సేవలు అందించాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద అన్ని రంగాల కార్మికులు మెరుగైన సేవలు అందించాలని కోరుతూ ధర్నా నిర్వహించి మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఈఎస్ఐ డిస్పెన్సరీలో మందులు లేవని కార్మికులను వెనక్కు పంపుతున్నారన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడానికి పని ముట్లు కూడా లేవన్నారు. కార్మికులకు కావాల్సిన మందులు తెప్పించడంతో బాటు వైద్య పరీక్షలకు అవసరమైన పనిముట్లు తెప్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కాగా గతంలో స్థానికంగా ఉన్న ఈఎస్ఐ లోకల్ ఆఫీస్‌ని తరలించడం వల్ల ఈ ప్రాంతంలో వేలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, లోకల్ ఆఫీస్ ఏర్పాటు చేసి కార్మికులకు సేవలు అందించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కొండల కరువులు, పతివాడ లక్ష్మణరావు, పతివాడ సన్యాసినాయుడు, మీసాల లెనిన్, పతివాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల: మాట్లాడుతున్న నల్లం శ్రీనివాసరావు

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు జరుగుతోందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.సుదర్శన రావు కోరారు. సోమవారం మధుపాడలో రెవెన్యూ సదస్సు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుదర్శనరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టిడిపి నాయకులు నల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఉన్న భూ సమస్యలను అర్జీల ద్వారా అధికారులకు తెలియజే యాలన్నారు. అంతకు ముందు రెవెన్యూ సదస్సులపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌డిటి ఎం. సత్య నారా యణ, సర్వేయర్ దివ్య, విఆర్ఒలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలో జమ్మాదేవిపేటలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండు దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ఎన్‌కెఆర్‌పురంలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ డి సన్యాసినాయుడు, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఆయా గ్రామాల పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మూడు తరాల నుండి సాగు చేసుకుంటున్నాం..తోట పల్లి కాలువ తవ్వేటప్పుడు నష్ట పరిహారం మాకే ఇచ్చారు.. విద్యుత్ హెవీ లైన్స్ వేసేటప్పుడు మాకే నష్ట పరిహారం ఇచ్చారు.. కాని మా భూములపై మాకు మాత్రం హక్కు కల్పించడం లేదంటూ మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు రెవెన్యూ అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అలజంగి గ్రామంలో తహసీల్దారు రాజారావు ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహి ంచారు. ఈ సదస్సులో తమకు జరిగిన అన్యాయాలపై అధికారుల వద్ద ఏకరువు పెట్టారు. తమ గ్రామము అలజంగి అయినప్పటికీ పేరిపి రెవిన్యూ పరిధిలో చాలా వరకు తమకు చెందిన భూములు న్నాయని అధికారులకు వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమకు ఆ భూములపై హక్కు కల్పించాలని అధికారులను వేడుకున్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ అభివృద్ధి

బొబ్బిలి: ఉత్తరాంధ్రను, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. కోటలో సోమవారం ఆయన మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 2వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు టిసిఎస్ ముందుకు వచ్చిందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేస్తామన్నారు. రైల్వే జోన్‌కు వైసిపి ప్రభుత్వం భూమి కేటాయించకపోతే టిడిపి కూటమి ప్రభుత్వం 52 ఎకరాలు అప్పగించిందని చెప్పారు. రైల్వే జోన్‌కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఎన్నికల హామీలకు కట్టుబడి అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. అభివృద్ధిలో సింహాద్రి ఎన్.టి.పి.సిలో 100 శాతం ఉత్పత్తి రాష్ట్రానికి కేటాయించారని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ కింద రూ.1.50లక్షల కోట్లతో రెండు విడతలలో అభివృద్ధి చేసేందుకు ఈనెల 8న మోడీ శంకుస్థాపన చేస్తారన్నారు. నక్కపల్లి దగ్గర రూ.1.75లక్షల కోట్లతో నూతన పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆయనతో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు ఉన్నారు.

మా సమ్మెకు మద్దతు తెలపండి

పొల్ట్రీ కార్మికులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

తాము గత కొన్ని నెలలుగా చేస్తున్న సమ్మెకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమకు మద్దతు తెలిపాలని కోరుతూ సోమవారం వెంకటరామా పౌల్ట్రీ కార్మికులు చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేశారు. మండల ప్రధాన కేంద్రంలో ఉన్న ప్రజా ప్రతినిధుల వద్దకు కూడా కార్మికులు వెళ్లి తమకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పౌల్ట్రీలో కార్మికులుగా పని చేస్తున్న తమకు పాత వేతన ఒప్పందం మే నెలతో పూర్తయిందని తిరిగి జూన్ 1వ తేదీ నుండి నూతన వేతన ఒప్పందం చేయాలని యాజమాన్యాన్ని కోరుతున్నామన్నారు. అయినప్పటికీ యాజమాన్యం మొండి వైఖరి కారణంగా తమకు నూతన వేతన ఒప్పందం చేయక పోగా తిరిగి తమను పోలీసులతో అణగ దొక్కేందుకు యత్నిస్తోందని వారు ప్రజా ప్రతినిధులకు వివరించారు.

ఈ నెల 7న డిసియల్‌లో చర్చలు ఉన్నాయని అవి విఫలమయితే తప్పని సరిగా ప్రజా ప్రతినిధులందరూ తమకు అండగా ఉండి తమ పోరాటానికి మద్దతు తెలపాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులను కలసిన వారిలో సిఐటియు స్థానిక నాయకులు ఇప్పిలి గురునాయుడు, ఈశ్వరరావు, ఎం పెదవెంకటరమణ, ట్రెజరీ ఎస్ ఉత్తరకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది పరిధిలోని బానాది, ఎం సింగవరం, బల్లంకి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపిటిసి గొంప తులసి కోరారు. సోమవారం ఆమె కలెక్టరు కార్యలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా తాను ఎంపిటిసిగా ఉన్నాని రాజకీయాలకు అతీతంగా మూడు గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు.

పనులు వేగవంతం

ప్రజాశక్తి- బాడంగి

పల్లె పండగ పనులు, క్యాటిల్ షెడ్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనులు నాణ్యతగా ఉండాలన్నారు. పని దినాలను ఎక్కువగా ఫారం పాండ్స్, ఫిష్ పాండ్స్, ట్రెంచేస్‌కి కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ విజయలక్ష్మి, సాంకేతికత సహాయకులు పాల్గొన్నారు.


జయప్రకాష్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజా, తదితరులు

జయప్రకాశ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- బాడంగి

కీర్తి శేషులు మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్ 17వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్షుమునాయడు, తల్లి సత్యవతిమ్మతో కలిసి సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 ఆగష్టులో తన జన్మదినం నాడే అన్న నందమూరి స్థాపించిన టిడిపిలో చేరి 1983, 1985, 1989, 1994, 2004 తెర్లాం నియోజకవర్గం నుంచి వరుసుగా ఆరుసార్లు పోటీ చేసి ఐదుసార్లు విజయం సాధించిన ప్రజానాయకుడు అని కొనియాడారు. తనను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎంతటి వారినైనా ఎదిరించే ముక్కు సూటి తనం, పట్టుదలతో పనులు చేయించగలిగే ధీరత్వం ఉన్న మహా నాయకుడు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తెంటు రవిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎస్.కోట సీతారాంపురం గ్రామ శివారులో కోడి పందేలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి జరిపి కోడిపందేలకు వాడే కత్తిని, కోడిపుంజుని, రూ.5వేలు నగదును స్వాధీనం చేసుకుని 7 గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. దేవి తెలిపారు.

తీర్మానం లేకుండా పనులు మంజూరు

కార్యదర్శి పై ఫిర్యాదు చేసిన దల్లిపేట సర్పంచ్ కాంత

ప్రజాశక్తి - భోగాపురం

ఉపాధి హామీ పథకంలో పల్లె పండగ పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానం లేకుండా నాలుగు పనులు మంజూరు కావడంతో సంబంధిత సర్పంచ్ సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి తన సంతకం లేకుండా నాలుగు పనులు మంజూరుకు ప్రతిపాదించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దల్లిపేట గ్రామ పంచాయతీలో గత ఏడాది ఆగస్టు నెలలో 51 పనులకు తీర్మానం చేశారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి రమేష్ ఈ తీర్మానాన్ని మండల పరిషత్ పంపగా అక్కడి నుంచి జిల్లా పరిషత్‌కి పంపించారు. కానీ ఇటీవలి పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రిజ్వాన్ మాత్రం పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్తు తీర్మానం చేయకుండా నేరుగా నాలుగు పనులకు ప్రతిపాదన చేశారు. తీర్మానం లేకుండా కార్యదర్శి పనులకు ప్రతిపాదించడంపై సర్పంచ్ దల్లి కాంత ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపిడిఒ కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఇఒపిఆర్‌డితో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని అన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మృతి చెందిన వ్యక్తి

ఈ నెల 2న అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు ఎక్కి, విద్యుత్తు తీగలు తగలడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఆ వ్యక్తి మృతిచెందాడు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9490617089 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆర్‌పి ఎస్ఐ బాలాజీరావు కోరారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 188.8 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop ,DwarakaNagar, Visakhapatnam, నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, PIN – 530018, CONTACT PERSON AREA MANAGER-NAGESH, CELL NO 89192-39576

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి కోర్టులో
OS. 28/2024

Between:- చెట్టుబోదుల తిరుమలేష్ .....వాది
And:- నరవ వెంకటరమణ మరియు వగైరాలు .....ప్రతివాది

To,
D-1: నరవ వెంకటరమణ, S/o లేటు తవుడు, బిజినెస్, R/o 1వ ఫ్లోర్, డోర్ నెం: 12-28,మొండి వీధి, రాజాం టౌన్ మరియు మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు వాది మీ వగైరాలపైన ప్రోనోట్ నోటు దావా రాబట్టు నిమిత్తం పై నెంబరు దావాను దాఖలు చేసినందున మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న ఎడల తేదీ **29-01-2025న ఉదయం 10:30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలేను. లేని ఎడల మిమ్మలని ఎక్స్‌పార్టీ చేసి మీ పరోక్షమందు వాదికి అవసరం అగు ఆర్డర్‌ని జారీ చేయడమగునని ఇందుమూలంగా మీకు తెలియపరచడమైనవి.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //
బి. మంజుల
కె. రమణమూర్తి
వాదితరుపు న్యాయవాదులు
రాజాం, విజయనగరంజిల్లా.
రాజాం, ఫోన్: 9949282812, 9949282813
తేది: 07-01-2025